

'ఎర్రకోట' వేడుకలకు అనంత మెడికోలు

ప్రజాశక్తి-అనంతపురం

భారత దేశ ప్రభుత్వం అత్యంత ప్రతష్టాత్మకంగా ఢిల్లీ ఎర్రకోటలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థులు ఎంపిక అయ్యారు. మెడికోలు ఎజి.పరిణీత సాయి, కె.హర్ష శ్రీ విష్ణులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్య రావు అభినందించారు. ఎన్ఎస్ఎస్ సమాజ సేవా కార్యక్రమాలు, మేరి మట్టి మేరా దేశ్, అమత వాటిక, రక్తదానం, మొక్కలు నాటే కార్యక్రమం, అవయవ దానం, కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం తదితర అంశాల్లో ప్రావీణ్యాన్ని గుర్తించి డాక్టర్ ఎన్‌టిఆర్ అరోగ్య విశ్వ విద్యాలయం తరఫున ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ నరసింహం,రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త డాక్టర్ వివేకానందలు ఈ విద్యార్థులతను ఎంపిక చేశారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి 20 మంది యువకులకు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించగా అందులో అనంత వైద్య విద్యార్థులు ఇద్దరు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. ఇలాంటి అవకాశాలు వచ్చేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడును అభినందించారు. ఈ నెల 11వ తేదీన విద్యార్థులు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతి భవన్ దగ్గర ఇంటర్నేషనల్ యూత్ హాస్టల్‌లో 13,14,15 మూడు రోజులు కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.




మెడికో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు

నామినేటెడ్‌పై ఆశలు..!

త్యాగం చేసిన వారికి ప్రాధాన్యత దక్కేనా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికార తెలుగుదేశం పార్టీలో కొంత మంది నాయకులు తమ స్థానాలను వదులుకున్నారు. ఇతరులకు టిక్కెట్లు ఇచ్చిన పార్టీకి సహకారం అందించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. ఇందులో సగానికిపైగా స్థానాల్లో అధికార తెలుగుదేశం పార్టీ మార్పులు చేపట్టింది. దీంతో అంతకుముందున్న సీనియర్లు పోటీ నుంచి తప్పుకుని పార్టీకి మద్దతుపలికారు. ఇప్పుడు పార్టీ అన్ని నియోజకవర్గాల్లోనూ విజయం సాధించింది. రాష్ట్రంలోనే అత్యధిక స్థానాల్లో టిడిపియే గెలుపొందింది. అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పోటీ నుంచి తప్పుకుని పార్టీ విజయానికి కృషి చేసిన నేతలకు ఏ మేరకు ఇప్పుడు ప్రాధాన్యత లభిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఈ విధంగా తప్పుకుని పనిచేసిన వారిలో అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఉన్నారు. ఎంతో సీనియర్ నాయకులైన ప్రభాకర్ చౌదరికి గత సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వలేదు. దగ్గుబాటి వెంకట ప్రసాద్‌కు టిక్కెట్టు ఇచ్చారు. ఆయన గెలుపొందారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌చౌదరికి ఎటువంటి ప్రాధాన్యతను టిడిపి అధిష్టానం ఇవ్వనుందన్నది చర్చ నడుస్తోంది. అదే రకంగా ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న పరిటాల శ్రీరామ్‌కు కూడా ఆయన కాకుండా బిజెపికి ఆ టిక్కెట్టు కేటాయించారు. అక్కడా బిజెపి విజయం సాధించింది. ఇప్పుడు ఆయనకు ఏ పదవినిస్తారన్నది చర్చ నడుస్తోంది. గతంలో అనంతపురం పార్లమెంటుకు గతంలో పోటీ చేసిన జెసి పవన్‌కుమార్‌రెడ్డి ఈసారి టిక్కెట్టు లేదు. ఆయనకు నామినేటెడ్ పదవి ఏదీ దక్కనుందన్నది చూడాల్సి ఉంది. ఒలంపిక్ అసోసియేషన్‌లో ఆయనకు పదవి దక్కనుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇక వీరితోపాటు గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్, కళ్యాణదుర్గంలో ఉన్నం హనుమంతరాయచౌదరి కుటుంబం, పుట్టపర్తిలో పల్లె రఘునాథరెడ్డి, మడకశిరలో ఈరన్నలకు గత ఎన్నికల్లో అవకాశం దక్కలేదు. ఈరన్న కుమారుడుకి టిక్కెట్టు కేటాయించి ఆఖరి నిమిషంలో మార్పుచేశారు. ఇలా సగానికిపైగా మాజీలకు చోటు దక్కనివారిలోనున్నారు. ఇప్పుడు వీరిలో ఎవరెవరికీ ఎటువంటి స్థానాలు దక్కనునాయన్నది ఆ పార్టీలో చర్చ నడుస్తోంది. ఇక వీరితోపాటు అనేక మంది సీనియరు నామినేటెడ్ పదవులైనా ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవలనే నామినేటెడ్ పదవులపైనా ఒక ప్రకటన చేసియున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారి పేర్లు తమ వద్దనున్నాయని, వారికి తగిన విధంగా న్యాయంచేస్తామని ప్రకటించియున్నారు. ఈ నేపథ్యంలో పనిచేసిన వారు ఇప్పటి వరకు పదవులు దక్కని వారు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఏదో విధంగా అధినాయకుడిని ప్రసన్నం చేసుకుని పదవులు దక్కించుకునే పనిలోనున్నారు. ఇక ద్వితీయ శ్రేణి నాయకులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ పేర్లను సిఫారసు చేయాలని విజ్ఞప్తులు చేసుకుంటూ ఉండటం గమనార్హం. ఇలా అధికారపార్టీ తెలుగుదేశంలో నేతల ఆశలు పెట్టుకుని ఉన్నారు.



ఇసుక అక్రమ రవాణా చేస్తే సహించం

మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. వైద్య చికిత్సల అనంతరం హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన శనివారం వీడియో ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. నందలపాడులో ఇష్టానుసారంగా ఇసుక రమణా పాల్పడుతున్నారని దీనినీ అరికట్టాలన్నారు. పట్టణ మొత్తం 40 మంది వరకు ఇసుక అక్రమంగా తరలింపునకు పాల్పడుతున్నారని వెంటనే వారంతా మానుకోవాలని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే బంధువైనా, స్నేహితుడైనా, కార్యకర్తలైన సహించేది లేదన్నారు. ఇసుక విషయంలో తనను క్షమించాలని కోరారు. తనను నమ్ముకున్న వారందరికీ వందశాతం మంచి చేస్తానని చెప్పారు. కష్టకాలంలో కౌన్సిలర్లు అందరూ అండగా నిలిచారని వారందరికీ తాను ఎంతో చేయాల్సి ఉందన్నారు.



మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు

అవినీతి విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం విద్యుత్ డివిజన్ పరిధిలో అక్రమాలకు పాల్పడుతున్న విద్యుత్ శాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో జరిగిన రాజకీయ పార్టీలు ఐక్యవేదిక సమావేశంలో నాయకులు శ్యామ్ కిరణ్, బీఎస్పీ పార్టీ శ్రీరాములు, ఆర్‌ఎస్పీ పార్టీ ఎ.శ్రీనివాసులు, ఎంఐఎం పార్టీ మున్నా, ఏపీఆర్‌ఎస్‌పి నౌషాద్, దళిత సమైక్య నాయకులు నారాయణ, ఎస్. హరిలు మాట్లాడుతూ హిందూపురం డివిజన్ స్థాయి పరిధిలో హిందూపురం అర్బన్, హిందూపురం రూరల్, మడకశిర, పెనుగొండ అన్ని ప్రాంతంలోనూ డివిజనల్ ఇంజినీర్‌తో పాటు ఏడీ, ఏఈలు డివిజన్ స్థాయిలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి అక్రమాస్తులు కూడబెట్టారన్నారు. ఆ అధికారుల ఆగడాలను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అవినీతికి సహకరించని కింది స్థాయి అధికారులు, సిబ్బందిని వేధిస్తూ అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగోన్నతలు, బదిలీల విషయంలో అధికారులు అక్రమార్జనకు పాల్పడుతున్నారన్నారు. ఉన్నతాధికారుల సైతం వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమాలు మరింత తీవ్రస్థాయిలో జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు అవినీతి అధికారులపై చర్యలు తీసుకోకపోతే రాజకీయ పార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

ప్రజాశక్తి-హిందూపురం

950వ సంవత్సరం ఆగస్టు 10వ తేదీన వెలువడిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ మూడవ పేరాను వ్యతిరేకిస్తూ స్థానిక సిఅండ్ఐజి మిషన్ కాంపౌండ్ చర్చిలో శనివారం నాడు భారత క్రైస్తవుల నిరసన దినంగా పాటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ దళితుల మత స్వేచ్ఛ, సమానత్వ హక్కును ఇతర రాజ్యాంగ హక్కులను కాలరాసే నల్ల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. రాజ్యాంగం ప్రకారం మత స్వేచ్ఛ హక్కు, సమానత్వపు హక్కును ప్రతి పౌరుడు సంపూర్ణంగా అనుభవించే వాతావరణం కల్పించాలన్నారు. దళిత బౌద్ధులు, దళిత సిక్కులకు ఎస్సీ హోదా కల్పించిన విధంగానే దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏ.నాగేంద్ర కుమార్, పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ ఎస్.సూర్యప్రకాష్, కార్యదర్శి సాల్మన్ రాజ్, సిఅండ్ఐజి మిషన్ కాంపౌండ్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ పి.స్టీఫెన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి దరఖాస్తులు ఆహ్వానం

పరిగి : మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా షెడ్లు ఏర్పాటు చేసుకునేం దుకు 'మినీ గోకులం' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఎడి సోమనాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌కార్డుతో పాటు పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కలిగిన చిన్న సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారు అర్హులని తెలిపారు. అప్లికేషన్ కోసం సమీప రైతు సేవా కేంద్రం, పశువైద్యశాలలో సంప్రదించాలని తెలిపారు.

శివశంకర్ రెడ్డికి మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

అనారోగ్యంతో బాధపడుతున్న కమ్మవారిపల్లి పంచాయతీ సర్పంచి శివశంకర్ రెడ్డిని ఆయన నివాసంలో మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ పరామర్శించారు. గత కొద్ది రోజులుగా శివ శంకర రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఇటీవల ఆసుపత్రిని నుంచి ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఆయన్ను పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి సరోజనాగేనాయక్, ఎంపిపి ప్రమీల మూర్తి, ఉప సర్పంచి బుల్లెట్ బాబు, పాటూరి లక్ష్మీరెడ్డి, నరసింహా రెడ్డి(సమర), చిట్టా తులసికుమార్, సాములపల్లి రాము పాల్గొన్నారు.



శివశంకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న శంకర నారాయణ

అప్రకటిత విద్యుత్ కోత

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల కేంద్రంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 5గంటల వరకు అప్రకటిత విద్యుత్ కోత కొనసాగింది. విద్యుత్ లేకపోవడంతో గహస్తులు, విద్యుత్ ఆధారిత చేతివత్తుల వారు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. గతంలో ఏదేని కారణాల వల్ల ఎక్కువ సమయం విద్యుత్ సరఫరా ఆపేయాల్సిన పరిస్థితి నెలకొన్న సంబంధిత అధికారులు ముందస్తు సమాచారాన్ని అందించే వారిని, విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయలను ఏర్పాటు చేసుకుని అవకాశం ఉండేది. శనివారం సుమారు ఎనిమిది గంటల పాటు మండల కేంద్రంలో విద్యుత్ కోత అమలు చేస్తున్నా ముందస్తు సమాచారం తెలపకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి, ప్రధాన లైన్లో ఏర్పడ్డ సాంకేతిక లోపాలు తొలగించి మరమ్మతులు చేయడం కోసం, వర్షాలు పడుతున్నందున ప్రధాన విద్యుత్ లైనుకు సమీపాన ఆవరించి ఉన్న చెట్ల కొమ్మల తొలగించడంతో కోసం విద్యుత్‌ను తొలగించినట్లు విద్యుత్ ఏడీఏ బాలసుబ్రమణ్యం తెలిపారు.

ఆక్రమణల తొలగింపు, రోడ్డు విస్తరణపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంతో పాటు సమీపంలోని గట్ల వద్ద ఉన్న ఎంపీడీవో కార్యాలయం వద్ద, పార్థసారథి కాల నీ, బైపాస్ రోడ్డు, కదిరి-హిందూపురం రహదారిలో రోడ్డు ఆక్రమించుకొని చేపట్టిన నిర్మాణాలను శని వారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు. వాటితో పాటు ఆయా శాఖల అధికారు లతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఫోర్ లైన్ రహదారి విస్తరణపై రోడ్ల భవనాల శాఖ డిఇ శైలజ, నేషనల్ హైవే అధికారిణి ధనలక్ష్మితో చర్చించి రోడ్డు పనులను నాణ్యతగా, మన్నికగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అలాగే రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఎఇ చెన్నకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌లను ఆదేశించారు. రోడ్డు విస్తరణతో ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని, సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతానని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు, పాల్గొన్నారు.



రోడ్డుపై ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

అంబేద్కర్ విగ్రహాలను తాకే అర్హత కూడా లేదు..!

వైసిపి నేతలపై ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఫైర్

ప్రజాశక్తి-మడకశిర

అంబేద్కర్ విగ్రహాలను తాకే అర్హత కూడా వైసీపీ నేతలకు లేదని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్.రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసమానతలు, వివక్షలు పారదోలి సమాజంలో సమానత్వాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రజా పాలన సాగాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ నేతలు ఒక్క రోజైనా దీనిని అనుసరించలేదన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని చెత్తబుట్టలో పడేసి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసిన ఫ్యాడలిస్టు జగన్ రెడ్డి అన్నారు. రాజధాని నడిబొడ్డున 30 ఎకరాల విస్తీర్ణంలో అమరావతిలో చేపట్టిన స్మతివనాన్ని అర్థాంతరంగా నిలిపివేసి రాజకీయ ప్రయోజనాల కోసం హడావుడిగా అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేశారన్నారు. అమరావతి అంబేద్కర్ స్మతివనంలో అంబేద్కర్ విగ్రహాల్ని ధ్వంసం చేశారని చెప్పారు. విజయవాడ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటులో రూ.258 కోట్లను వైసీపీ నేతలు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. అంబేద్కర్ పేరు కంటే పెద్ద అక్షరాలతో జగన్ పేరు పెట్టుకుని రాజ్యాంగ నిర్మాతనే అవమానించిన తీరుకు నిరసనగా కొందరు జగన్ పేరును తొలగించారని చెప్పారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఉండాల్సిన అంబేద్కర్ పేరు స్థానంలో జగన్ రెడ్డి పేరు పెట్టడం రాజ్యాంగ నిర్మాతను అవమానించడం కాదాని ప్రశ్నించారు. జగన్ పేరును తొలగిస్తే అంబేద్కర్ పేరు తొలగించారంటూ చేస్తున్న దుష్ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యతో సహా 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి, దళిత వర్గాలకు సంక్షేమ పథకాలు దూరం చేసిన దళిత ద్రోహి జగన్ రెడ్డి అన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.40 వేల కోట్లు దారిమళ్లించారన్నారు. 188 మంది దళితులు జగన్ పాలనలో హత్యకు గురయ్యారన్నారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని జగన్ పక్కనే పెట్టుకుని తిరగడం దారుణం అన్నారు. ఇప్పటికైనా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి బీసీలు, దళితులకు మధ్య గొడవలు పెట్టడం మానుకోవాలని హితవు పలికారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఎస్.రాజు

రోడ్డుపై విరిగిపడిన చెట్టు

రెండ్రోజులుగా రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మండలం లోని కప్పలబండ పంచాయతీ పరిధిలోని ఆర్‌వి జానకిరామ్ కాలనీలో గత గురువారం గాలివాన ధాటికి ఓ చెట్టు రోడ్డుకు అడ్డంగా విరిగి పడింది. దీంతో ఆ మార్గంలో రెండు రోజులుగా రాకపోకలు బంద్ అయ్యాయి. శనివారం ఆ కాలనీవాసులు మాట్లాడుతూ గాలివానకు చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడి రెండు రోజులైనా అధికారులు పట్టించుకోలేదన్నారు. దీంతో కాలనీలోకి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కనీసం నడిచివెళ్లేందుకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కాలనీలోకి పోవాలంటే మరో రహదారి నుంచి అర్ధ కిలోమీటర్‌కు పైగా దూరం వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలన్న ఆ మార్గంలోనే వెళ్లాలి. ఈ విషయాన్ని సర్పంచి చిన్న పెద్దన్న పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా శనివారం సాయంత్రమైనా చెట్టును మాత్రం తొలగించలేదన్నారు.



రోడ్డుకు అడ్డుగా విరిగిపడిన చెట్టు

జెసితో మాజీ మంత్రి పల్లె భేటీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

హైదారాబాద్‌లోని జెసి నివాసంలో మాజీ మంత్రి జెసి.దివాకర్‌రెడ్డిని శనివారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. వారు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. గత ఐదేళ్లలో జగన్ పాలనతో విసుగు చెందిన ప్రజలు కూటమికి అఖండ విజయం అందించారని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎపికి చంద్రబాబు నాయకత్వం ఎంతో అవసరమని జెసి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బిజెపి, టిడిపి కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం రాష్ట్రానికి ఎంతో లాభదాయకం అన్నారు. అలాగే కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయాలపై కూడా వారు సుదీర్ఘంగా చర్చించారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలకు తక్షణం కృష్ణా జలాలు తీసుకు రావల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.



జెసి దివాకర్‌రెడ్డితో భేటీ అయిన పల్లె రఘునాథరెడ్డి

టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కదిరి టౌన్

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని శనివారం పట్టణంలోని ఎస్‌టిఎస్ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో ఫ్రెండ్లీ టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కదిరి ప్రాంత మండల విద్యాశాఖ అధికారులు చెన్నకృష్ణ, కృష్ణానాయక్, సురేష్, ఆర్‌డిటి క్రికెట్ కోచ్ నజీర్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వకంగా జరిగే ఈ క్రికెట్ పోటీలు మానసిక ఉల్లాసం, ఆరోగ్యాన్ని కలిగిస్తాయన్నారు. ఇలాంటి టోర్నీలు నిర్వహించడం వల్ల ఉపాధ్యాయుల మధ్య సఖ్యత ఏర్పడుతుందన్నారు. మొదటి మ్యాచ్‌లో ముదిగుబ్బ జట్టుపై గాండ్లపెంట, రెండో మ్యాచ్‌లో నల్లచెరువు జట్టుపై ఒడిసి జట్టు విజయం సాధించాయి. మూడో మ్యాచ్‌లో తనకల్లు-1, తలుపుల జట్టు పోటీ పడగా టైగా ముగిసింది. నిర్వాహకులు ప్రతి మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాసులు, తాహేర్‌వలి, సురేంద్ర, రామ్మోహన్, ఆజంబాషా, నారాయణ, రుద్రమరెడ్డి, ఆర్గనైజర్స్ శ్రీనివాసులు, అశ్వర్థనారాయణ, గోపాల్, మనోహర్, శివరామకృష్ణ, నాగేంద్ర, వెంకటనారాయణ, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధి : మంత్రి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్'లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఐదు స్వచ్ఛభారత్ ట్రాక్టర్లను కేటాయించింది. వాటిని మంత్రి సత్యకుమార్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి శనివా రం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. అలాగే బత్తలపల్లి మండలంలోని సంజీవపురం, మాల్యవంతం, ధర్మవరం మండలం లోని మల్లాకాల్వ, రావులచెరువు, తాడిమర్రి మండలంలోని దాడితోట పంచాయతీలకు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ జాతిపిత మహాత్మ గాంధీ స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారం చేపట్టినప్పటి నుంచి నిరాటంకంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారన్నారు. మెరుగైన పారిశుధ్యంతో ప్రజల ఆరోగ్యానికి హామీ లభిస్తుందన్నారు. ప్రజలంతా స్వచ్ఛ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఇళ్ల, పరిసరాలు, వీధులు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త ట్రాకర్లు వచ్చినప్పుడు వారికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వెంకటశివరామిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు జిఎం.శేఖర్, ఉపాధ్యక్షుడు సాకే ఓబులేసు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నాయకులు కుణుతూరు వేణుగోపాల రెడ్డి, సందా రాఘవ, జింకా పురుషోత్తం, పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్ ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

కోటి బాబు ఇంటికెళ్లిన మంత్రి

బత్తలపల్లి : బత్తలపల్లిలోని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు ఇంట్లో తేనేటి విందుకు శనివారం మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. మంత్రి మండలంలోని మాల్యవంతం గ్రామంలో గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో బత్తలపల్లిలోని కోటి సుధ, కోటి సూర్య ప్రకాష్ బాబు ఇంటికి వెళ్లారు. తేనేటి విందు స్వీకరించి, వివిధ అంశాలపై కాసేపు చర్చించారు. వారితో పాటు బిజెపి మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, ఉపసర్పంచి కోటి గోపి, రమేష్, రామకృష్ణ, శంకర్‌రెడ్డి, శీన, ఆది, నాగార్జున, మల్లి, నాగిరెడ్డి, సుదర్శన్, అనిల్, హరి, కొండ, తిరుపతయ్య, గోపాల్, శ్రీకాంత్ ఉన్నారు.



ఎస్ఎంసి నూతన చైర్మన్‌ను అభినందిస్తున్న గుండుమల తిప్పేస్వామి

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-మడకశిర

నూతనంగా ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసి) చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులు ఆయా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సూచించారు. పట్టణంలోని బాలాజీ నగర్ టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసి చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఇతర సౌకర్యాలు అందేలా పర్యవేక్షణ చేయాలన్నారు. తమ వంతుగా ఉపాధ్యాయులకు సహకరించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మనోహర్, బేగార్లపల్లి రవికుమార్, మంజునాథ్, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాల తనిఖీ



పాఠశాలను పరిశీలిస్తున్న వడిత్యా శంకర్‌నాయక్

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ సందర్శించి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే వంటగది, టాయిలెట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, తదితర సమస్యలు గుర్తించామని వీటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇక పాఠశాల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని హెచ్చరించారు.



ఎమ్మెల్యే కందికుంటకు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

అన్నదానానికి ఎమ్మెల్యే రూ. లక్ష విరాళం

నల్లచెరువు : శ్రావణమాసం సందర్భంగా శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి రూ. 1 లక్ష విరాళం అందజేశారు. ఎమ్మెల్యేకి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

వైద్య శిబిరం ఏర్పాటు

పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం ఆలయం వద్ద నల్లచెరువు పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ కల్పనారెడ్డి తెలిపారు. శిబిరంలో సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, ఎఎన్ఎం యోగి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఆశా కార్యకర్తలు వైద్య సేవలు అందించారు.



ఖాద్రీశుని ఆలయ ఆవరణలో భక్తుల సందడి

ఖాద్రీశుని ఆలయానికి భక్తుల తాకిడి

కదిరి అర్బన్ : శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో ఆలయ ఆవరణం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులు స్వామి వారికి మొక్కు చెల్లించి, తలనీలాలు సమర్పించుకొని అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్వామి వారి సన్నిధిలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గరుడ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గాండ్లపెంట : శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా మండలంలోని వేపరాల, బోలుగుట్లవారిపల్లి, మునగలవారిపల్లి వద్ద వెలసిన శ్రీగరుడ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శనార్థం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

ధర్మవరం టౌన్ : ఈ నెల 19వ తేదీ పౌర్ణమి సందర్భంగా ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి అరుణా చలం, కాణిపాకం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు ధర్మవరం డిపో నుంచి ఈ నెల 18వ తేదీ ఉదయం 6 గంటలకు బయల్దేరుతుందన్నారు. రానుపోనూ ఛార్జీ రూ. 1400. ఆన్‌లైన్ లేదా బస్టాండ్‌లో రిజర్వేషన్ కౌంటర్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చు. వివరాలకు 63031 51302, 99592 25859 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మండల నాయకులు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును శనివారం మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో మండల టిడిపి నాయకులు కలిశారు. మండల కన్వీనర్ జయచంద్ర, బిసి సెల్ నాయకులు బోరు రమణ, మైనార్టీ నాయకులు జాకీర్ హుస్సేన్, గండికోట ఇర్షాద్, షనవాజ్ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. కష్టకాలంలో పార్టీ కోసం నిబద్ధతతో పని చేసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరగా, పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని, వారి సేవలను గుర్తిస్తుందని హామీ ఇచ్చారని వారు తెలిపారు.



టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో మండల నాయకులు

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) 51వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి విజయచంద్రారెడ్డి, యుటిఎఫ్ పూర్వ నాయకులు హనుమంతరావు, అల్లాబకాష్ పతాకాన్ని ఆవిష్కరించి గీతం ఆలపించారు. అలాగే యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పోటీల్లో 36 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ 1974 ఆగస్టు 10వ తేదీ యుటిఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ప్రస్తుతం లక్ష మందికి పైగా సభ్యత్వం కలిగి, రాష్ట్రంలోనే అగ్రగామిగా పేరొందిన సంఘం యుటిఎఫ్ అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో యుటిఎఫ్ ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి నిస్వార్థంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శివశంకర్, నాయకులు నారాయణస్వామి, కిష్టప్ప, సాయిగణేశ్, రామకృష్ణానాయక్, లక్ష్మయ్య, హరిశంకర్, ఆంజనేయులు, అమరనారాయణరెడ్డి, ఆదిరెడ్డి, నాగేంద్రకుమార్, సాయినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జయరాములు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప ఆధ్వర్యంలో యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు కె.భూతన్న, కార్యదర్శి హరికృష్ణ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల అభ్యున్నతితో పాటు, సామాజిక స్పృహతో ఆవిర్భవించిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజల పక్షాన అనేక ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, కదిరన్న, కెటి.హనుమంతరాయప్ప, దేవరాజు, బంగారు,



ధర్మవరంలో యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

నంజప్ప, శివశంకర్ పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం యుటి ఎఫ్ అని జిల్లా కోశాధికారి శ్రీనివాసులు అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యదర్శి చెన్నూర్ తాహెర్‌వలి అధ్యక్షతన పట్టణంలోని ఎంఆర్‌సి ప్రాంగణంలో జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు యుటిఎఫ్ స్వర్ణోత్సవ జెండాను ఆవిష్కరించగా సీనియర్ నాయకులు బి.మైనుద్దీన్, జిల్లా కార్యదర్శి వైవి.సుబ్బారెడ్డి కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ అమరజీవి అప్పారి వెంకటస్వామి, దాచురి రామిరెడ్డి లాంటి ఎంతోమంది గొప్ప నాయకుల పోరాటాల వల్ల ఉపాధ్యాయులు, విద్యా వ్యవస్థ ఉన్నత స్థాయికి చేరుకుందన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయుల సమస్యలు, ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లికార్జున, ఆజంబాషా, సునీల్ కుమార్, రమణ నాయక్, ఖాజా మొయిద్దీన్, సంతోష్ కుమార్, నజీర్, మహబూబ్‌బాషా, రామసుబ్బయ్య, ఫైరోజ్, మనోహర్, రమేష్, ఖాదర్‌బాషా, శివరామకృష్ణ, నాగరాజు, భార్గవ, షరీఫ్, రామకృష్ణ, నారాయణరెడ్డి, జబీఉల్లా, రెడ్డిశేఖర్‌రెడ్డి, మురళి, రామ్‌ప్రసాద్‌నాయక్, హనీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిసి.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. నరేష్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్య బలోపేతం కోసం రాజీలేని పోరాటాలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ డివిజన్ నాయకులు ఉపేంద్ర, గంగాధర్, ఆదిజినేష్, శివయ్య, శీన, కాశీ, రాజశేఖర్, శేషాద్రి, రామాంజనేయులు పాల్గొన్నారు.



కదిరిలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

బెంబేలెత్తించిన దొంగలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎంతో పకడ్బందీగా ఉండే ఎటిఎంల దొంగతనాలు బెంబేలెత్తిస్తున్నాయి. వరుసగా రెండు రోజుల్లో రెండు చోట్ల ఎటిఎం కేంద్రాలనే దోచేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. అది కూడా ఒకటి గార్లదిన్నె మండల కేంద్రంలో చోటు చేసుకోగా, మరొకటి జిల్లా కేంద్రమైన అనంతపురం నగరంలో చోటు చేసుకుంది. అది కూడా జనరద్దీ ఉండే రాంనగర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఈ పని చేసినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నగరం నడిబొడ్డున దొంగలు రాత్రి సమయంలో వచ్చి గ్యాస్ కట్టర్లతో కట్ చేసి ఎటిఎం దొంగలించి రూ. 30 లక్షల నగుదు దోచుకోవడం సంచలనం కలిగిస్తోంది. ఎందుకంటే దొంగతనాలను అరికట్టేందుకని రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ ఉందా లేదా అన్న చర్చ నడుస్తోంది. ఎన్నికల సమయం నుంచి వరుసగా ఉన్నతాధికారులు బదిలీలవుతూ వస్తున్నారు. ఇటీవలనే అనంతపురం ఎస్పీగా మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరిగి గస్తీని ప్రారంభించే విధంగా అధికారులను ఆదేశించారు. చోరీయే కాకుండా సత్యసాయి జిల్లాలోనూ హిందూపురంలో రిటైర్డు డీఎస్పీ నివాసంలోనూ చోరీ జరిగింది. ఇంకా ఇతర ప్రాంతాల్లోనూ ఈ వారంలో చోరీలు చోటు చేసుకున్నాయి. వరుస చోరీలు అందరిలోనూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పోలీసులు వీటిపై దృష్టి సారించి అరికట్టే చర్యలు చేపట్టాలని సామాన్యులు కోరుతున్నారు. ఇక ఈ వారంలో చోటు చేసకున్న ఇతర ప్రధాన అంశాల్లో రాజకీయపరమైనవి ఉన్నాయి. వైసిపికి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య రాజీనామా చేసి బిజెపిలో చేరారు. కొత్తగా ఆ పార్టీకి అధ్యక్షులుగా ఎవరిని నియమిస్తారన్నది చూడాల్సి ఉంది. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలొచ్చినప్పటి నుంచి ముఖ్యనేతలెవరూ పెద్దగా కనిపించడం లేదు. గతంలో అధికారంలో నున్న సమయంలో నిత్యం మీడియా సమావేశాల్లో పెడుతూ హల్‌చల్ చేసే నేతల అలికిడి కూడా ఎక్కడా కనిపించడం లేదు. ఇక టిడిపిలోనూ, కూటమిలో లుకలుకలు బయటకు వస్తూనే ఉన్నాయి. ధర్మవరంలో టిడిపి, బిజెపి నేతలు బాహిరంగంగా ఘర్షణ పడ్డారు. ప్రభుత్వమెచ్చాక స్కీమ్ వర్కర్ల తొలగింపుపై సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వమెచ్చిన మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు , ఆశా వర్కర్లు ఇలా స్కీమ్ వర్కర్లు అందరినీ తొలగిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో తొలగింపులు సరైనవి కావని పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అదే విధంగా అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యక్రమం వద్ద నిరసన చేపట్టారు. జులై నెలలో తీవ్ర వర్షాభావంతో పంటల సాగు ప్రభావం పడింది. ఆగస్టు నెలలో ఈ వారంలో ఓ మోస్తరు వర్షపాతం పడింది. వర్షం జిల్లా అంతటా ఒకే రకంగా పడిలేదు. అక్కడక్కడ వర్షాలు పడటంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన పంట అయిన వేరుశనగ సాగుకు ఇప్పటి సమయం ముగిసింది. ఇక ప్రత్యామ్నాయ పంటలైనా సాగు చేసుకునేందుకు సమయముంది. జిల్లా వ్యవసాయాధికారులు ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించారు.

అంబేద్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసంపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం తగదని హిందూపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని ప్రధాన కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దీపిక మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అప్పటి సిఎం జగన్ భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారన్నారు. కొందరు టిడిపి దుండగులు సుత్తులు, ఇతర పరికరాలతో విగ్రహ శిలాఫలకాన్ని, జగన్ పేరును ధ్వంసం చేశారని మండిపడ్డారు. ఇది రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానమని, ఈ ఘటనను ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కౌన్సిలర్ మల్లికార్జున, బాలాజీ మనోహర్, నక్కలపల్లి శ్రీరామ్‌రెడ్డి, ఖలీల్, నాగమణి, రూరల్ మండల కన్వీనర్ రాము, లేపాక్షి మండల వైస్ ఎంపిపి అంజనరెడ్డి, ధనుంజయరెడ్డి, గిరి, మన్సూర్‌ఖాన్, నవీన్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ


గాండ్లపెంట : విజయవాడలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నాయకులు, వైసిపి నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచేలా శిలాఫలకాన్ని తొలగించడం బాధాకరమని, నిందితులను వెంటనే అరెస్టు చేసి



హిందూపురంలో నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఎం.నరసింహులు, వై.శ్రీరాములు, చంద్ర, వైసిపి మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్ అలీ, మాజీ జడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం శిలాఫలకంపై ఉన్న మాజీ సిఎం జగన్ పేరు తొలగించడం ఏమాత్రం సమంజసం కాదని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప తెలిపారు. వైసిపి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ దాదాపు రూ. 400 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ విగ్రహం శిలాఫలకంపై ఉన్న జగన్ పేరును దుండగులు చెరిపి వేయడం తగదని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర, జడ్పిటిసి మూర్తి, వైసిపి నాయకులు నరసయ్యగౌడ్, తిమ్మప్ప, మల్లికార్జున, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన నాయకులకు సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా వైఎస్ఆర్‌టిఎ నూతన కార్యవర్గం ఎన్నిక

పుట్టపర్తి అర్బన్ : జిల్లా వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం పట్టణంలో రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జంషీద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత కార్యవర్గం కాల పరిమితి ముగియ డంతో నూతన కార్యవర్గం ఎన్నిక అనివార్యమైంది. జిల్లా అధ్యక్షులుగా పివి. రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రప్రసాద్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, ఏ మండలంలోని మిగులు ఉపాధ్యా యులను ఆ మండలంలో అవసరమైన చోటుకు మాత్రమే సర్దుబాటు చేయాలని, పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని, ఉపాధ్యాయులకు విద్యేతర పనులు అప్పగించరాదని డిమాండ్ చేశారు. జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లా డుతూ ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంత రం వారిని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అలీ, ప్రతాప్‌రెడ్డి, గోవిందరెడ్డి, రమణప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాల్యవంతంలో 'రాజకీయ' సందడి

గృహ ప్రవేశానికి హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు

బత్తలపల్లి : ధర్మవరం మాజీ ఎమ్మెల్యేలు గోనుగుంట్ల అనంతరెడ్డి, గోనుగుంట్ల జయమ్మ దంపతుల తనయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్ గృహ ప్రవేశ కార్యక్రమానికి శనివారం మంత్రి సత్యకుమార్‌యాద్ తో పాటు, పలువురు టిడిపి ఎమ్మెల్యేలు హాజరవడంతో మండలంలోని మాల్య వంతం గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గోనుగుంట్ల రూపలత, గోనుగుంట్ల విజయకుమార్ దంపతుల గృహ ప్రవేశ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. శుభకార్యానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుబాటి ప్రసాద్, అలిమినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి, పరిటాల సునీత, మాజీ మేయర్ స్వరూప, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తదితరులు హాజరయ్యారు. నియోజక టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. రూరల్ సిఐ ఆరోహణరావు, ఎస్ఐ శ్రీనివాసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సిబ్బందితో పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదవ శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు రాజేశ్ స్వామి మూల విరాట్‌ను వివిధ పూలు, పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేష్ పాల్గొన్నారు.

కుటుంబానికి 'చిలకం' చేయూత



నాగేంద్ర భార్యకు నగదు అందజేస్తున్న చిలకం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తారక రామాపురంలో నివాసం ఉంటున్న దివ్యాంగుడు ఆలకుంట నాగేంద్ర కుటుంబానికి శనివారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. నాగేంద్ర కుటుంబ పరిస్థితులను పార్టీ కార్యకర్తలు చిలకం దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాగేంద్ర భార్య నందుకు రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, కడపల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి సవితను కలిసిన వారిలో తురకలాపట్నం టిడిపి నాయకులు, గ్రామస్తులు

పాఠశాలలో నూతన భవనాలు నిర్మించాలని వినతి

రొద్దం : మండలంలోని తురకలాపట్నం గ్రామ ఎంపిపి పాఠశాలలో నూతన భవనాలు నిర్మించాలని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ నూతన చైర్మన్ నరసింహులు, వైస్ చైర్‌పర్సన్ పుష్ప శనివారం పెను కొండ పట్టణంలో మంత్రి సవితను కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ 30ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనాలు ఇటీవల కాలంలో కూలిపోయాయని, దీంతో గదుల కొరతతో ఆరు బయటే తరగ తులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం, ఎండాకాలం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలపారు. వారి వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



రేషన్ షాపును ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

పరిగి : మండలంలోని మోద గ్రామంలో శనివారం ప్రభుత్వ చౌక దుకాణాన్ని మండల టిడిపి నాయకులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కార్డుదారు లకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పంపిణీ చేయాలని, కార్డుదారులతో మర్యాదగా నడుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి సూర్యనారాయణ, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, డీలర్ శివ, నాయకులు మారుతి, ప్రసాద్, కృష్ణమూర్తి, నారాయణరెడ్డి, నాగరాజు, నాగభూషణం పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం మాజీ ఎంపి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల కిష్టప్ప ప్రభుత్వ చౌక దుకాణాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గోపాల్‌రెడ్డి, నాయకులు సాయిప్రసాద్, గంగాద్రి, శీన, డీలర్ పాపన్న, వెంకటశివప్ప, నరార్యవ్రకాష్‌రెడ్డి, హనుమంతరెడ్డి, చంద్రాయప్ప, శ్రీరామప్ప, శంకర, వెంకటశివ, లక్ష్మినారాయణరెడ్డి పాల్గొన్నారు.



రేషన్ షాపును ప్రారంభిస్తున్న నిమ్మల కిష్టప్ప

ప్రమాదకరస్థాయిలో ఆటో ప్రయాణం!

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను, అధిక టన్నేజీతో ఎరువుల బస్తాలు, వివిధ రకాల వస్తువులను రవాణా చేస్తున్నారు. దీంతో ఏ క్షణమైనా ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని విద్యావతులు పేర్కొంటున్నారు. అలాంటి వారిపై పోలీసులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న వాదనలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో వ్యవసాయ, తదితర పనులకు కూలీలను తీసుకెళ్లడానికి ఆటోలను వినియోగిస్తున్నారు. అయితే ఒక్కో ఆటోలో దాదాపు 20 మంది వరకూ కూలీలను తరలిస్తున్నారు. దీనికి తోడు చాలా మంది ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేవని తెలుస్తోంది. మరికొందరు డ్రైవర్లు ఎల్‌కెజి, యుకెజి నుంచి పదో తరగతి వరకూ పాఠశాలల పిల్లలను తరలిస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా పోలీసులు అధికలోడు తరలించే ఆటోలపైప చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో పరిమితికి మించి ఎక్కిన ప్రయాణికులు

కర్నాటక మద్యం పట్టివేత.. వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-హిందూపురం

అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సెబ్ సిఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. హిందూపురం రూరల్ మండలంలోని కంచనపల్లి నుంచి కిరికెరకు వెళ్లే రహదారిలో కొటిపి క్రాస్ వద్ద అక్రమంగా మద్యం రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో హిందూపురం పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కి చెందిన నవీన్ స్కూటర్‌పై కర్నాటక మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 10 బాక్సులు (960 టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకుని స్కూటర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ కమలాకర్, సిబ్బంది ప్రకాష్, రమణ, వెంకటేశం, ఆంజనేయులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న కర్నాటక మద్యం, ద్విచక్ర వాహనం